క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



దుస్తులు పంపిణీ చేసిన సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు క్రీడలకు సంబంధించిన డ్రెస్‌లను పంపిణీ చేశారు. పాఠశాల స్థాయిలోనే కాకుండా మండల, జిల్లాస్థాయిలో వివిధ రకాల క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లిక, ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరాలు శనివారం ముగిశాయి. కొన్ని రోజుల నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా వారి సహకారంతో ఆయా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించిన వైద్యుడు గణేశ్, సిబ్బంది పశువులకు చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు.

సొంత నిధులతో మరమ్మతులు



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని ఇమామ్‌నారారం గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గతకొంతకాలంగా పని చేయడం లేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ మండలాధ్యక్షుడు జగన్ రెడ్డి సొంత నిధులతో శనివారం మరమ్మతులు చేయించారు. దీంతో చీకటిగా ఉన్నవాడలో వెలుగులు నిండాయి. స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

నిర్మలారెడ్డికి సన్మానం



నిర్మలారెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో గెలుపొంది, కార్మిక పోరాట సమితి యూనియన్ సలహాదారుగా నియమితులైన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డిని శనివారం పరిశ్రమ యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం జనరల్ మేనేజర్ సుబ్బు షామ్, పర్సనల్ మేనేజర్ రామకృష్ణ, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్, యూనియన్ అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నాయకులు గురుకిరణ్, విఠల్,శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఆర్డీఓగా దేవుజా



జహీరాబాద్: జహీరాబాద్ రెగ్యులర్ ఆర్డీఓగా దేవుజా నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. దేవుజా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా కొనసాగారు. ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన రాంరెడ్డి మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. రాంరెడ్డి సెలవుపై వెళ్లిన కారణంగా ఇప్పటివరకు దేవుజా ఇన్‌చార్జి ఆర్డీఓగా వ్యవహరించారు.

చెట్ల కొమ్మలు తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగించిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి బైపాస్ నుంచి స్థానిక ఐబీకి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. 'సాక్షి దినపత్రికలో ' ఈ నెల 15న ప్రచురించారు. పట్టణ పోలీసు శాఖ,విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మలను తొలగించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు బతుకమ్మ సంబురం

ముందస్తు బతుకమ్మ సంబరాలు జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలు, కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొని సందడి చేశారు.



ఝరాసంగంలో బతుకమ్మ సంబురాలు



నారాయణఖేడ్: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో..



జహీరాబాద్ టౌన్: గోవింద్‌పూర్ పాఠశాలలో బతుమక్మ వేడుకలు



పటాన్‌చెరు టౌన్: బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ



హత్నూర: నస్తీపూర్ ప్రభుత్వ పాఠశాలలో..



వట్‌పల్లి(అందోల్): మోడల్ పాఠశాలలో..



కల్హేర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.

పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు శనివారం సీపీఐ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. బొంతపల్లి, దోమడుగు, గడ్డిపోతారం గ్రామాల పరిధిలోని రసాయన పరిశ్రమలు వ్యర్థజలాలు, వాయు కాలుష్యం వెదజల్లుతున్నాయి. చుట్టుపక్కల ఉన్న సాగుకు యోగ్యమైన భూములు బీడు భూములుగా మారాయి. అలాగే చెరువులు, కుంటలు విషపూరితమైన జలాలతో నిండి ప్రమాదకరంగా తయారయ్యాయి. మూగజీవాలు ఆ నీళ్లు తాగి చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల చుట్టుపక్కల గ్రామాల్లో నీళ్ల కోసం బోర్లు వేస్తే నీళ్లు తాగే పరిస్థితి లేదని ఆ నీళ్లు తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా మారిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆర్ లక్ష్మి, సీహెచ్ అశోక్, మాణెమ్మ, విజయలక్ష్మి, అనుసూజ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

ఉచిత న్యాయ సాయం అందించాలి

సంగారెడ్డి టౌన్: జైలులోని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శనివారం కందిలోని సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైలులోని ఖైదీలకు అన్ని వసతులు కల్పిస్తూ సమయానికి మూలాఖత్ అందించాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సద్గుణ

జహీరాబాద్ టౌన్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సద్గుణ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం మొగుడంపల్లిలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లీబిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉండాలంటే పోషకహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు ముర్రిపాలను ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుద్ధమైన నీటిని తాగాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాణయ్య సేవలు మరువలేనివి

నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వర్గీయ మాణయ్య కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మాణయ్య వర్ధంతి సందర్భంగా హత్నూర మండలం లింగాపూర్‌లో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని గర్భిణీలకు మాతృదేవోభవ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మాణయ్య చేసిన సేవలు చిరస్మరణీయంగా ప్రజల గుండెల్లో ఉన్నాయన్నారు. ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ, మాజీ మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజిరెడ్డి

22 కొండెంగల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్: ప్రజలపై దాడి చేస్తూ ఇళ్లలో నుంచి బయటికి రాకుండా భయాందోళనలకు గురిచేసిన కొండెంగలను ప్రత్యేక నిపుణుల బృందం పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించారు. ఈనెల 17న 'సాక్షి' మెయిన్‌లో 'కొండెంగల వీరంగం', 20 మందికి గాయాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఫారెస్టు, మున్సిపల్ శాఖల అధికారులు స్పందించారు. ఆయా శాఖల అధి కారులు రంగంలోకి దిగి మూడు రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్‌లో 22 కొండెంగలను ప్రత్యేక బృందం బోన్‌లో బంధించారు. వాటిని అటవీ ప్రాంతాలకు తరలించారు. ఫారెస్టు డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావులు ప్రత్యేక చొరవ తీసుకుని కొండెంగలను బంధించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఆయా కాలనీల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



బోనులో బందీగా ఉన్న కొండెంగలు

సంక్షిప్త వార్తలు

◆ **పేకాటరాయుళ్ల అరెస్టు**

జహీరాబాద్ టౌన్: పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ తెలిపారు. శనివారం మండలంలోని అర్జున్ నాయక్ తండాలో పేకాట ఆడుతున్నట్లు సమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ 8,100 నగదు, పేకాట ముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సుమోటో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

◆ **కొనసాగుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలు**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం పట్టణ పరిధిలోని 12,13,19 వార్డుల్లో కమిషనర్ కిషన్ సూచన మేరకు పారిశుద్ధ్య కార్మికులు రోడ్లు, పరిసరాలు, చెత్తచెదారం తొలగించి శుభ్రంగా తీర్చిదిద్దారు. స్వచ్ఛతా కార్యక్రమాలకు స్థానికులు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోదకుమార్ కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **పక్కాగా నీటి వనరుల గణన**

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలంలోని నీటి వనరుల లెక్క పక్కాగా చేయాలని తహసీల్దార్ ఫర్హిన్ షేక్ జీపీఓలను ఆదేశించారు. హత్నూర రైతు వేదికలో శనివారం జీపీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 2024- 28 సంవత్సరానికి గాను నీటి వనరులను గుర్తించి జియో ట్యాకింగ్ చేయాలని తెలిపారు. గ్రామాల్లోని చిరుకుంటల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఎస్‌ఓ చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ దావూద్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్డీఓ ఆఫీస్ ఎదుట నిరసన దీక్ష**

జోగిపేట(అందోల్): ఎన్నికల సమయంలో వికలాంగులకు రూ.4018 నుంచి రూ.6016కు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఈ మేరకు శనివారం అందోల్-జోగిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట వికలాంగులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా వికలాంగుల ఉపాధ్యక్షుడు సుభాశ్‌రామ్ చందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు అవుతుందన్నారు. ఇప్పటికై నా వికలాంగుల పింఛన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి ఆఫీసు వినతిపత్రాన్ని సమర్పించారు. అందోల్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఖలీల్ మియా, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింలు సలహాదారుడు చిన్నయ్య, రియాజ్ ఉస్మాన్ పాల్గొన్నారు.

◆ **మట్టితో దుర్గామాత విగ్రహం తయారీ**

వట్‌పల్లి(అందోల్): దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా అందోల్ మండలం రోళ్లపాడ్ ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థి మట్టితో దుర్గామాత విగ్రహాన్ని తయారు చేశాడు. 4వ తరగతి చదువుతున్న సంపత్ చెరువులోని మట్టిని తీసుకువచ్చి శనివారం పాఠశాలలోనే దుర్గామాత ఫొటోను చూసుకుంటూ తయారు చేశాడు. చూపరులను ఆకర్షించేలా మట్టితో దుర్గామాత విగ్రహం తయారు చేయడంపై పలువురు ప్రశంసించారు. విద్యార్థి ప్రతిభకు ప్రధానోపాధ్యాయులు రాజమల్లు అభినందించారు.

◆ **ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం**

సదాశివపేట(సంగారెడ్డి): ఎన్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్న విద్యార్థి సామాజిక కార్యకర్తగా, సమర్థవంతమైన నిర్వాహకుడిగా, నాయకుడిగా ఆత్మస్థైర్యంతో ఎలాంటి గడ్డు పరిస్థితులైనా ఎదుర్కొనేలా తయారవుతారని ప్రిన్సిపాల్ బంగ్లాభారతి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకంలో చేరి సమాజానికి తమ వంతు సహకారం అందించాలన్నారు. సమాజానికి సేవ చేయడానికి ఎన్ఎస్ఎస్‌ను ఒక వేదిక పరిగణించాలని సూచించారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా ప్రజాసేవలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి మురళీకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ నుంచి రాంతీర్థ్, గుంజోటి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రోడ్డు గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హద్నూర్‌లో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నందున రాంతీర్థ్, గుంజోటి, వడ్డి, శంశల్లాపూర్, హుస్సెల్లి తదితర గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం, విద్యార్థులు విద్యనభ్యసించేందుకు వస్తుంటారు. రోడ్డు అధ్వా నంగా మారడంతో ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ మీదు గా తమ గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా హద్నూర్ చెరువు నిండి అలుగు పారుతోంది. ఆ నీరంతా రోడ్డుపైకి రావడంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పాడైన రోడ్డును శనివారం బీజేపీ నాయకులు ఓంకార్ తదితరులు పరిశీలించారు. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

మల్చింగ్ పద్ధతితో అధిక దిగుబడులు

శాస్త్రవేత్తలు డా.అరుణ, డా. నిర్మల

వట్‌పల్లి(అందోల్): రైతులు మల్చింగ్ పద్ధతి ద్వారా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి పొందవచ్చని సంగుపేట రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.కే. అరుణ, డా.ఏ.నిర్మల, కే.రాహుల్ విశ్వకర్మ అన్నారు. శనివారం అందోల్ పరిధి కన్‌సాన్‌పల్లి గ్రామంలో కంది, మామిడి సాగు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఉపయోగం వంటి అంశాలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు ద్వారా రైతులందరూ స్వయం ఉపాధితో పాటు సాగులో మెలకువలు నేర్చుకోవచ్చన్నారు. మామిడిలో నాణ్యమైన పంట దిగుబడి కోసం సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రస్తుతం కంది పంటను ఎక్కువగా ఆశించే మారుకా మచ్చల పురుగు నివారణకు క్లోరిపైరీపాస్ మందును లీటర్ నీటికి 2 మీ.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగు నివారణకు ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాణిక్యరెడ్డి, వెంకటేశం, మాజీ వార్డు సభ్యులు గజేందర్‌రెడ్డి, రైతులు సంగమేశ్వర్, వినోద్‌రెడ్డి, మాధవరెడ్డి, వీరేశం, ప్రభాకర్ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వసతిగృహాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

మండల ప్రత్యేక అధికారి అంబదాస్



రికార్డులను పరిశీలిస్తున్న అంబదాస్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి అంబదాస్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు శనివారం పట్టణ మండల పరిధిలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రెసిడెన్షియల్, కేజీబీవీ, మహాత్మా జ్యోతిరావుపూలే వసతి గృహాలను పరిశీలించారు. అలాగే, వసతి గృహాల్లోని పైకప్పులు, తరగతి గదులు, వంట గదులు, ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, వసతి గృహాల పరిసరాలతో పాటు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంబదాస్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసువస్తే సత్వర పరిష్కారం చేస్తాయనున్నట్లు వార్డెన్‌లు, ఎస్ఓలకు సూచించారు. అనంతరం వసతి గృహాల్లోని రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ, ఎంఈఓ శంకర్, ఎంపీడీఓ లక్ష్మీవసతి గృహాల వార్డెన్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి..నెరవేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచడంతోపాటు, కొత్త పెన్షన్ మంజూరు చేయాలంటూ శనివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేశారు. అనంతరం తహసీల్దార్ రంగారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులతోపాటు మిగతా చేయూత పింఛన్లు రూ.2,016 నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాని కోరారు. కార్యక్రమలో మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు మేరీ, సత్యనారాయణ, చెన్నారెడ్డి, అంజమ్మ, ధనలక్ష్మి, శ్రీకాంత్, మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ అధ్యక్షురాలు, సభ్యులు

వీధివ్యాపారులకు రుణాలు

నారాయణఖేడ్: వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో లోక్ కల్యాణ్ మేళా పథకంలో భాగంగా రుణాలు అందించనున్నట్లు ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో వీధి వ్యాపారులకు అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. వీధివ్యాపారులకు లోక్ కల్యాణ్ మేళా పథకం వరం లాంటిదన్నారు. పథకం గురించి సమగ్రంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. మున్సిపల్ మేనేజర్ వెంకటశివయ్య, మెప్మా టీఎంసీ అనిత, వివిధ బ్యాంకుల మేనేజర్లు, క్షేత్రస్థాయి అధికారులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ జగ్జీవన్

స్కూల్ బస్సులతో నష్టం

టూరిస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ రెడ్డి

సంగారెడ్డి : స్కూల్ బస్సులు శుభకార్యాలకు వెళ్లడంతో టూరిస్ట్ బస్సులకు నష్టం జరగడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలో తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోపాల్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కమిటీని నియమించి, నూతనంగా ఎన్నికై న సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. ట్రావెల్స్ రంగం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, జిల్లా స్థాయిలో మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని కొత్త కమిటీ సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు. అలాగే, శుభకార్యాలు ,ఇతర కార్యక్రమాలకు స్కూల్ బస్సులు పంపిస్తున్నందున యజమాన్యాలు పన్నులు చెల్లించి నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసింహారెడ్డి, ట్రెజరర్ రమణారెడ్డి, సంగారెడ్డి వైస్ ప్రెసిడెంట్ మోహన్ యాదవ్, సంగారెడ్డి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ సందీప్ రెడ్డి, సంగారెడ్డి డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ ఎండీ పాషా, సంగారెడ్డి డిస్ట్రిక్ట్ ట్రెజరర్ సత్యనారాయణ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో టూరిస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ రెడ్డి